# ఖరీదైన ఖరీఫ్



గురజాలలో సాగుకు సిద్ధం చేసిన పంట పొలం

- పెట్టుబడులు కొండంత... దిగుబడి గోరంత
- పెరుగుతున్న సాగు ఖర్చులు
- కూలీల రేట్లు అధికమే

**గురజాల :** ఖరీఫ్ సాగు ఖర్చులను తలచుకుంటుంటే రైతులకు భయమేస్తుంది. వరి సాగు రైతులు ముఖ్యంగా ఆందోళన చెందుతున్నారు. ప్రతి సంవత్సరం పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయే కానీ దిగుబడి మాత్రం కనిపించడం లేదు. గతంలో రైతులు ఒకరి పొలంలో ఒకరు సహాయం చేసుకునేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. అంతా డబ్బు మయమైంది. పొలంలో పనుల కోసమని అక్కడక్కడ అప్పులు తెచ్చి పెట్టుబడి పెడుతున్నారు. గతంతో పోల్చితే సాగు ఖర్చు అధికంగా కనిపిస్తుంది. పెట్టిన పెట్టుబడికి తగినట్లు దిగుబడి ఉండటం లేదు. పంట ఇంటికి వచ్చేంత వరకు బెంగ తప్పడం లేదు.

**వరుణుడి కోసం ఎదురుచూపులు**

వాతావరణంలో మార్పుల కనిపిస్తున్నప్పటికి చినుకు రాలడం లేదు. వాతావరణ శాఖ అధికారులు ముందస్తు వర్షాలు కురుస్తాయని చెప్పడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ నేటి వరకు కూడా చినుకు పడకపోవడంతో ఆకాశం వైపు రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రైతులు తమ పంట పొలాలను వేసవి దుక్కులు దున్ని సిద్ధం చేశారు. గతంతో పోల్చితే ఈ ఏడాది సాగు విస్తీర్ణం తక్కువనే అంచనాలు కనిపిస్తున్నాయి.

**భారీగా పెరిగిన కూలీల రేట్లు**

ప్రతి ఏడాది కూలీల రేట్లు పెరుగుతూనే ఉన్నాయి. గతంలో ఆడవారికి రూ.200 కూలీ రేటు ఉంటే ప్రస్తుతం రూ.300 ఉంది. గతంలో మగవారికి రూ.300 కాగా ఇప్పుడు రూ.500 వరకు ఉంది. వారికి ఇంత రేటు ఇచ్చినా కూలీలు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా ప్రతి ఎకరాకు ఎరువులు, అన్ని రకాల ఖర్చులు కలుపుకుని మొత్తంగా సాగుకు రూ.40 వేలు ఖర్చు వస్తుందని రైతులు చెబుతున్నారు.

**రైతులకు మిగిలేది శూన్యమే**

ఖరీఫ్‌లో రైతులకు ఇక మిగిలేది శూన్యమే. తొలకరిలో వాతావరణం అనుకూలించినా పంటకు తెగుళ్లు వంటివి సోకి పంట చేతికి అందకుండా పోతుంది. కౌలు రైతులు రైతులకు శిస్తు చెల్లించగా.. వారికి మిగిలేది ఏమీ ఉండదు. దీంతో ఖరీఫ్ సాగు చేయడం కన్నా మిన్నకుండిపోవడం మిన్న అని రైతులు, కౌలు రైతులు భావిస్తున్నారు.

## క్లుప్తంగా

### ఎమ్మెల్యే కన్నాను పరామర్శించిన ఎమ్మెల్యే యరపతినేని



**పిడుగురాళ్ల:** సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. ఇటీవల కుడి భుజం నొప్పితో బాధపడుతున్న సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే యరపతినేని నిమ్స్‌లో ఆయనను పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

### కౌలు కార్డులను కౌలు రైతులు పొందాలి



**పిడుగురాళ్ల:** కౌలు రైతు కార్డులను కౌలు రైతులు పొందాలని ఏవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జూలకల్లు రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కౌలు రైతులు తప్పనిసరిగా కార్డులు పొందటం వలన పంట బీమా సౌకర్యం పొందవచ్చన్నారు. కౌలు రైతులకు విత్తనాలపై రాయితీ లభిస్తుందన్నారు. పంటకు మద్దతు ధర కల్పించటం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు నగర పంచాయతీ సమావేశం

**దాచేపల్లి :** నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం 28న శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డీవీఎస్ నారాయణరావు గురువారం తెలిపారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని చెప్పారు.

### ఇంటర్ సప్లిమెంటరీలో మాచర్ల విద్యార్థుల ప్రతిభ

**మాచర్ల:** ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు బైపీసీలో ప్రవీణ్ 455 మార్కులు, ఎస్.డి.నజియా ఫాతిమా 454, సాహితి 448, హారిక 404 సీఈసీలో బషీర్ 427 మార్కులు సాధించారు. పల్నాడు జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపీసీలో భానుమతి 463 మార్కులు, స్వాతి 460, జలీల్ 460 మార్కులు సాధించారని గురువారం కళాశాలల డైరెక్టర్‌లు పఠాన్ నాగూర్‌వలి, వెంకటనారాయణ, శివభాస్కర్, లక్ష్మీనారాయణలు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

### చాగంటివారిపాలెంలో ఆయుర్వేద వైద్య శిబిరం



**చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ):** మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో జెరియాట్రిక్ క్యాంపు గురువారం నిర్వహించారు. శిబిరంలో మండల ఆయుర్వేద వైద్యశాల వైద్యులు పి.సరళ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. వృద్ధులకు బీపీ, షుగర్, ఆయాసం, కిడ్నీ సమస్యలు, మోకాళ్ల నొప్పులు వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించినట్లు వైద్యురాలు సరళ తెలిపారు. మొత్తం 122 మందికి వైద్య సేవలందించామన్నారు. దీర్ఘకాలికంగా నయం కాని వ్యాధులను సైతం ఆయుర్వేద వైద్యం ద్వారా నయం చేసుకోవచ్చని, మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో కాంపౌండర్ సునీత, అటెండర్ రమేష్, యోగా ఇన్‌స్ట్రక్టర్ సరిత, తదితరులు పాల్గొన్నారు.

### షిర్డీ సాయిబాబా మందిరంలో అన్నదానం



**క్రోసూరు:** క్రోసూరులోని షిర్డీ సాయిబాబా మందిరంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురువారం సాయిబాబాకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజు సందర్భంగా ప్రతి గురువారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు తెలిపారు. ఉదయం మందిరంలో కాకడ హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆశేషంగా పాల్గొన్నారు.

## అతిసార నివారణకు చర్యలు



సమావేశంలో చర్చిస్తున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు

**దాచేపల్లి :** అతిసార నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పి.గీతావాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుల సమావేశం గురువారం జరిగింది. కేసానుపల్లితో పాటు పలు గ్రామాల్లో అతిసార కేసులు నమోదుపై చర్చించారు. తహసీల్దార్ గీతావాణి మాట్లాడుతూ.. అతిసార ప్రబలకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రధానంగా పారిశుధ్య నిర్వహణపై చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి ట్యాంక్‌లు, పైపులను క్లోరినేషన్ చేయాలని సూచించారు. డాక్టర్ మధు మాట్లాడుతూ.. జూలై 1వ తేదీ నుంచి ఆగష్టు 31 వరకు అతిసార ప్రభావం ఉండే అవకాశాలు ఉన్నాయని, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. 5 సంవత్సరాల లోపు పిల్లలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాలని, అతిసార బారిన పడిన బాధితులకు వైద్య సేవలు అందించాలని చెప్పారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు ఎంపీడీవో వెంకటరమణ, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, ఎంఈవో పినాకపాణి, ఏఈ అంగడి సోమయ్య, సీహెచ్‌వో కృష్ణకుమారి, ఎంపీహెచ్‌వో పట్టాభి, సూపర్‌వైజర్లు గోవిందమ్మ, సరస్వతి దేవి, లక్ష్మయ్య, మేరీకుమారి తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మందులను పంపిణీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

**వైద్య శిబిరంలో మందులు పంపిణీ**

**రెంటచింతల:** స్థానిక వడ్డెర బావి సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వ్యాధి గ్రస్తులకు మందులను పంపిణీ చేస్తూ ఆ ప్రాంతంలో ఇంటింటి డయేరియా కేసుల సర్వే చేపట్టినట్లు గోలి వైద్యాధికారి కె.ప్రదీప్‌కుమార్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో ఎక్కువగా డయేరియా కేసులు అధికంగా వచ్చిన కారణంగా డీఎంహెచ్‌వో డాక్టర్ రవి ఆదేశాల మేరకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వేను చేపట్టి వాటి వివరాలను గూగుల్ షీట్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కలుషితమైన నీటిని తాగడం వలన డయేరియా (అతిసార) వస్తుందని, ఈ డయేరియా ఏ విధంగా వస్తుందో కాలనీ ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. డయేరియా వచ్చిన వారు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి వచ్చి వైద్య సేవలు పొందాలని కోరారు. గ్రామంలో అతిసార వ్యాధి వచ్చిన ప్రాంతాలలో గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులను చేపట్టాలన్నారు. మినరల్‌వాటర్ తాగాలని, పంచాయతీ ట్యాప్ వాటర్‌ను వేడిచేసి తాగడం ఆరోగ్యానికి మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది మహేష్‌బాబు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సిడిమాను మహోత్సవం



**తుమ్మకోట(రెంటచింతల):** మండలంలోని తుమ్మకోట గ్రామంలో ఇంద్రపల్లి ముత్యాలమ్మ జాతరలో భాగంగా శుక్రవారం సిడిమాను మహోత్సవం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఎంతో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సాయికృష్ణ నేతృత్వంలో గ్రామ దేవతైన ఇంద్రపల్లి ముత్యాలమ్మకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ జాతరను పూర్వం నుంచి ఒక ఆచారంగా 9 రోజుల పాటు గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు జరుపుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో అన్ని సామాజిక వర్గాల ప్రజలు ఇంద్రపల్లి ముత్యాలమ్మ ఆలయం వద్ద నుంచి సిడిమానుతో మేళతాళాలతో చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా గులాంలు చల్లుకుంటూ ఉల్లాసంగా... ఉత్సాహంగా గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనాదిగా 2 సంవత్సరాలకు ఒకసారి ఇంద్రపల్లి ముత్యాలమ్మ జాతరను గ్రామంలో నిర్వహించడం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ఎస్ఐ ఎం.ఆంజనేయులు సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

## సీసీఆర్‌సీ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి



కౌలు రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి

**రాజుపాలెం:** ప్రతి కౌలు రైతు కౌలు కార్డు కొరకు రైతు భరోసా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య తెలిపారు. రాజుపాలెం గ్రామ సచివాలయంలో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ కౌలు రైతు కార్డు కొరకు భూ యజమాని పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ కాపీ, కౌలు రైతు పాస్‌పోర్ట్ ఫొటో, దరఖాస్తు పూర్తి చేసి స్థానిక రైతు భరోసా కేంద్రంలో అందజేయాలని తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల వీఆర్వోలను సంప్రదించాలని తెలిపారు. కార్డులు పొందిన రైతులకు బ్యాంక్ రుణాలు, పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకొనుటకు, పంట బీమా, పంట నష్టపరిహారం, పంట నమోదు తదితర ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వాసు, వీఆర్వో శిరీష, తదితరులు పాల్గొన్నారు.

## పంట సాగు పత్రాలతో ప్రయోజనాలు పొందండి



ఆర్బీకేలో కౌలు గుర్తింపు కార్డుల గ్రామ సభ

**దొడ్లేరు(క్రోసూరు):** పంటలు కౌలుకు సాగు చేసే రైతులు కౌలు గుర్తింపు కార్డులు పొంది పంట సాగు ప్రయోజనాలు పొందాలని ఏవో వేణుగోపాల్ గురువారం కౌలు సాగు రైతులకు పిలుపునిచ్చారు. మండలంలోని దొడ్లేరు, ఆవులవారిపాలెం గ్రామాల్లోని ఆర్బీకేల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ఆయన కౌలు రైతులకు కౌలు కార్డులపై అవగాహన కల్పించారు. ప్రతి కౌలు సాగుదారుడు దరఖాస్తు చేసుకుని కౌలు కార్డులు పొందాలన్నారు. కౌలు కార్డుల వలన రైతులు మద్దతు ధరకు ఈ క్రాపింగ్ ద్వారా తమ పంట విక్రయించుకునే సౌలభ్యం ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు పంట బీమా వర్తిస్తుందని, ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తుందని తెలియజేశారు. అంతేకాక బ్యాంకుల ద్వారా పంటపై రుణాలు పొందేందుకు వీలుపడుతుందన్నారు. కావున కౌలు సాగుదారులు తప్పనిసరిగా స్థానిక రెవెన్యూ అధికారికి కౌలు కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 2,063 కౌలు కార్డులు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 332 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, ఏఏవోలు, రైతులు పాల్గొన్నారు.

### ఒప్పిచర్లలో మహిళ అనుమానాస్పద మృతి

**కారెంపూడి:** 48 ఏళ్ల మహిళ ఆమె ఉంటున్న గదిలోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గురువారం గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఈ ఘటన వెలుగు చూసింది. కారెంపూడి సీఐ ఎ.శ్రీనివాసరావు, ఎస్ఐ కె.అమీర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనకు సంబంధించి గ్రామస్తులు చెబుతున్న వివరాలిలా ఉన్నాయి. ఒప్పిచర్ల గ్రామానికి చెందిన గండికోట విజయలక్ష్మి గ్రామ ప్రధాన రహదారిని కలిపే చోట ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన చాలా కాలంగా కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తోంది. అక్కడకు మద్యం తాగే వారు వచ్చి ఆ పరిసరాలలో మద్యం సేవిస్తుంటారు. విజయలక్ష్మి వ్యాపారం చేసుకుంటూ షాపు వెనుక వైపు ఉన్న గదిలో ఉంటోంది. గురువారం ఉదయం గది బయట తాళం వేసి ఉండడం విజయలక్ష్మి కన్పించకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తలుపులు తెరవగా ఆమె మృతదేహం కన్పించింది. ఆమెపై అత్యాచారానికి పాల్పడి హత్య చేశారా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే విజయలక్ష్మికి భర్త, ముగ్గురు పిల్లలున్నారు.

### ప్రత్యేక అలంకరణలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



**పిడుగురాళ్ల:** పిడుగురాళ్ల పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో గురువారం షష్టి తిథి సందర్భంగా సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

### బీసీజీ వ్యాక్సిన్ ప్రక్రియ పరిశీలన

**మాదల(ముప్పాళ్ళ):** మండలంలోని మాదల గ్రామంలో జరుగుతున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ ప్రక్రియను జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ గురువారం పరిశీలించారు. 60 సంవత్సరాలు పైబడిన వారందరికీ వ్యాక్సిన్ అందించాలని ఆయన సూచించారు. షుగర్ వ్యాధి ఉన్నప్పటికీ వ్యాక్సిన్ అందించవచ్చన్నారు. వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేసిన తర్వాత అర్ధగంట వరకు పర్యవేక్షణలో ఉంచుకోవాలన్నారు. 18 సంవత్సరాలు దాటిన తర్వాత పొగాకు ఉత్పత్తులు వాడే వారికి, టీబీ పేషంట్స్‌కు వ్యాక్సిన్ అందించాలన్నారు. 85 మందికి వ్యాక్సిన్ అందించినట్లు ఆయన తెలిపారు. అలాగే 60 మందికి సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించటం జరిగిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో పీహెచ్‌సీ వైద్యురాలు పి.రమాదేవి, సూపర్‌వైజర్ ఎం.జోస్పిన్‌రాణి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



సమావేశంలో కౌన్సిలర్లు

**మాచర్ల:** రాజకీయాలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. గురువారం మాచర్ల పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిని కోరుతూ కూటమి ప్రభుత్వాన్ని కూటమిని ఆదరించారన్నారు. మాచర్ల నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మంచినీరు, పారిశుధ్య, విద్యుత్, రోడ్లు తదితర వాటి అభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేద్దామన్నారు. దీనికి కౌన్సిలర్లు ఉమ్మడిగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, రామాంజనేయరెడ్డి, అరుణ, శ్రీను, షేక్ సుభాని, బోయ రఘురామిరెడ్డి, ఎం.శ్రీనివాసరావు, షేక్ షరీనా, సంతోష్, పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని అభినందించారు.

## వరికపూడిశెల పూర్తి చేసి పల్నాడును సస్యశ్యామలం చేస్తా

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

**దుర్గి:** ఎన్నో దశాబ్దాలుగా రైతులు ఎదురుచూస్తున్న వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కంది విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో కంది పంటను సాగు చేస్తున్న వారికి విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులకు సేవలందిస్తున్న అధికారులను అభినందించారు. కూటమి ప్రభుత్వ హయాంలో రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ప్రతి ఒక్క కౌలు రైతు సంబంధించిన గుర్తింపు కార్డులను పొందాలన్నారు. దీని వలన పంట నష్టపోయినా ఇబ్బంది లేకుండా ప్రభుత్వం సహాయ సహకారాలందిస్తుందన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణాన్ని సీఎం చంద్రబాబు సారథ్యంలో రెండేళ్లలోపే పూర్తి చేస్తానన్నారు. ఈ కార్యక్రమానికి ఏడీఏ జగదీష్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో వై.అమీర్‌రెడ్డి, ఎంపీడీవో గుప్తా, వ్యవసాయ సిబ్బంది, టీడీపీ నాయకులు యేచూరి సాయి శంకర్, కటకం రామారావు, వివిధ గ్రామాల రైతులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి



**రెంటచింతల:** ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తన శుద్ధి చేయడం వలన అధిక దిగుబడులను సాధించడంతో పాటు పలు ప్రయోజనాలను పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రైతులు పంటలను సాగు చేసే సమయంలో కచ్చితంగా విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పును కలిపి ఎంపిక చేసుకున్న విత్తనాలను పోయగా పైకి తేలిన తాలు విత్తనాలను తీసివేయాలన్నారు. నీటి అడుగున మునిగి ఉన్న గట్టి విత్తనాలను మాత్రమే నారు పోసుకోవాలన్నారు. ఒక కిలో వరి విత్తనానికి ఒక లీటరు నీటిలో 2.5 గ్రాముల కార్బండిజమ్ కలిపి 24 గంటలు నానబెట్టిన అనంతరం మరో 20 గంటల నుంచి 24 గంటల పాటు మంచినీటిలో విత్తనాన్ని ఉంచి తరువాత నారు మడులలో చల్లు కోవాలన్నారు. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. నారు మడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వ పురుగు సోకకుండా ఉండటానికి మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లేముందు 0.2 శాతం క్లోరిప్రేరిఫాస్ ద్రావణంలో నానపెట్టి చల్లుకోవాలన్నారు. లేదా కార్బనిజంతో కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. పత్తి ఒక కిలో విత్తనానికి 8 గ్రాముల ట్రైకో డెర్మావిరిడితో, ఒక కేజి మిరప విత్తనాన్ని 8 నుంచి 10 ఎంఎల్ గౌచో ద్రావణంలో విత్తన శుద్ధి చేయడం మంచిదన్నారు. విత్తన శుద్ధి చేసి సాగు చేస్తున్న పంటలను చీడ, పీడల నుంచి కాపాడుకోవచ్చన్నారు. పత్తి చుట్టూ అంతరపంటగా 4 సాళ్లకు ఒక సాలుకు కంది, మినప, పెసర పంటలను సాగు చేసుకోవచ్చునన్నారు. మాగాణి చుట్టూ గట్టుపై కంది పంటను రైతులు అంతర పంటగా సాగు చేయడం వలన రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. వ్యవసాయ శాఖ కూడా అంతర పంటలను సాగు చేసే రైతులను ప్రోత్సహిస్తుందన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



దోమ లార్వాలను చూపుతున్న ఆరోగ్య పర్యవేక్షకులు అంకమ్మరావు

**రెంటచింతల:** సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు అన్నారు. పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవి రత్నాకర్ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి 30 వరకు నిర్వహించనున్న మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం రెంటచింతల పీహెచ్‌సీ పరిధిలోని పశర్లపాడు గ్రామంలో ర్యాలీ నిర్వహించి పలు కాలనీలలోని ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఇళ్లలోనున్న పాతటైర్లు, కొబ్బరి బొండాలను వెంటనే తొలగించాలని, కూలర్‌లలోని నీటిని వారానికి ఒకసారి కచ్చితంగా మార్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ముందున్న సైడ్‌కాలువలలో వారానికి ఒకసారి కిరోసిన్ లేదా బ్లీచింగ్ చల్లుకోవాలని దీంతో ఈగలు, దోమలు నశిస్తాయని తెలిపారు. ప్రతి శుక్రవారాన్ని కచ్చితంగా డ్రైడేగా పాటించాలన్నారు. దోమ తెరలను వాడుకోవాలని సూచించారు. దోమలను పారదోలడం వలన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, బోదవ్యాధి వంటి వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చన్నారు. వరుసగా రెండు, మూడు రోజుల పాటు జ్వరం వచ్చిన వెంటనే పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, హెల్త్ అసిస్టెంట్ మహేష్ బాబు, ఏఎన్ఎం శిరీష, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కృషి చేస్తుంది



జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న పెదకూరపాడు తాలూకా సభ్యులు

**పెదకూరపాడు:** ఉద్యోగుల సమస్యలపై ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి శెట్టి సతీష్‌కుమార్‌లు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ పెదకూరపాడు తాలూకా సమావేశం తాలూకా అధ్యక్షుడు విజయకుమార్, కార్యదర్శి శ్రీనివాసరావుల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించుకునేందుకు అందరూ సంఘటితంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో తాలూకా సహ అధ్యక్షుడు వెంకట్రావు, ఉపాధ్యక్షుడు సుబ్బారావు, పెదకాబాబు, వెంకట్రావు, సహాయ కార్యదర్శి నరసింహారావు, యుగంధర్, నితిన్, దిలీప్‌కుమార్, మహిళ సంయుక్త కార్యదర్శి సుశీల, కోశాధికారి ఏడుకొండలు పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తాం



**రాజుపాలెం:** నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యవర్గ సమావేశం మండలంలోని కొండమోడు సమీపంలోని వీరమ్మ కాలనీలో దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ అధ్యక్షులు గరికపాటి శంకరరావు మాట్లాడుతూ జిల్లా కేంద్రం నరసరావుపేటలో కార్యాలయం ఏర్పాటుకు తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశాలు అన్ని మండల కేంద్రాలలోను, నియోజకవర్గాలలోను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.కుమార్, కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు, కోటా బాబూరావు, జాలా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.